

రామప్ప భద్రత.. గాలిలో దీపమేనా?

- 20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే
- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల ఆక్షేపణలు

7




రక్షణ చర్యలకు నోచుకోని రామప్ప దేవాలయం ఆవరణలోని ఉప ఆలయం గొల్లాలగుడి



అది ప్రపంచ వారసత్వ సంపదగా.. యునెస్కో గుర్తింపు పొందిన.. ప్రాచీన శిల్పకళా సంపదకు నిలయమైన రామప్ప దేవాలయం. ఇక్కడ ప్రధాన ఆలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలున్నాయి. ఈ అద్భుత కట్టడాలను తిలకించేందుకు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అలాంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. రక్షణ మాత్రం కరువైంది. ఇందుకు ఇటీవల రామప్ప అనుబంధ ఆలయమైన గొల్లాలగుడి వద్ద గుప్తనిధుల కోసం జరిగిన తవ్వకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అంతేకాదు ఏకంగా వెయ్యి కిలోల బరువున్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కిందికి తోశారు. దీంతో రామలింగేశ్వరుడి రక్షణపై అనుమానాలు పెరుగుతున్నాయి. అయితే రామప్ప పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

- వెంకటాపూర్ (రామప్ప)

వసూళ్ల దందా షురూ!




- ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు గాలం
- ఔట్‌సోర్సింగ్ సేవలందిస్తున్న ఓ ఎన్జీవో నిర్వాకం
- ప్రతీ జిల్లాలో 25 పాఠశాలల్లో 50 మంది నియామకమంటూ ప్రచారం
- ఇలా 33 జిల్లాల్లో 1,650 ఉద్యోగాలు ఉన్నాయట..
- ఎవరు రూ.1.50లక్షలు ముందు చెల్లిస్తే వారిదే ఉద్యోగమట
- ప్రతీ జిల్లాలో 10 నుంచి 12 మంది కమీషన్ ఏజెంట్లు
- వారి సాయంతో వసూళ్లకు కొందరి ప్లాన్

భూపాలపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం.. సగటు నిరుద్యోగి కల. అది ప్రభుత్వ.. కాంట్రాక్టు ఉద్యోగమైనా లేక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగమైనా సరే ఫలానా శాఖలో ఖాళీ ఉందంటే నిరుద్యోగులు ఎగబడుతున్న పరిస్థితి. నిరుద్యోగుల ఆశలు.. ఆకాంక్షలను ఆసరాగా చేసుకుంటున్న దళారులు ఉద్యోగాల పేరుతో అమాయకులను నమ్మిస్తూ నట్టేట ముంచుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తి విద్య ఉపాధ్యాయ ఉద్యోగాల పేరిట వసూళ్ల పర్వం మొదలైంది. కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ద్వారా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన కంప్యూటర్ విద్య విద్యార్థుల నైపుణ్యం మాట ఎలా ఉన్నా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు మాత్రం కాసుల పంట పండిస్తోంది. సమగ్ర శిక్ష పథకంలో భాగంగా తెలంగాణలో 33 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు 25 పాఠశాలల చొప్పున ఎంపిక చేసి 50 మంది సిబ్బందిని పొరుగు సేవల పద్ధతిలో నియమిస్తోంది. ఇందుకుగాను సిబ్బంది నియామకంలో అనుభవం కలిగిన ఎన్జీవోలకు అప్పగించగా ప్రస్తుతం ఈ ఏజెన్సీలు ఉపాధ్యాయులు, సహాయకుల నియామకం పేరిట కోట్లల్లో డబ్బులు దండుకునేందుకు పక్కా స్కెచ్ వేశాయి. జిల్లాల వారీగా ఏజెంట్లను నియమించుకొని ఇప్పటికే కాసుల వేటకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పాఠశాలలతో పాటు పెద్దపల్లి జిల్లాలోని మరో పాఠశాలలో నియమించిన సిబ్బంది కాపీ పత్రాలను ఏజెంట్లకు అప్పగించి వాటిని సాక్ష్యంగా చూపిస్తూ అమాయక నిరుద్యోగులకు గాలం వేస్తున్నారు.

హైదరాబాద్‌కు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ల ఉద్యోగాల పేరిట భారీ మొత్తంలో నిరుద్యోగులకు టోకరా వేసేందుకు మూడు నెలల క్రితమే రంగం సిద్ధం చేసుకుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే 33 జిల్లాల్లో ఏజెంట్లను నియమించుకొని కమిషన్ ప్రాతిపదికపై అభ్యర్థులను వెతికి పెట్టేందుకు కసరత్తు పూర్తి చేసుకుందని 'ఆంధ్రజ్యోతి' జరిపిన పరిశీలనలో తేలింది. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 825 పాఠశాలల్లో నైపుణ్య శిక్షణ కోసం ఔట్ సోర్సింగ్ సంస్థల ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఆ కాంట్రాక్టు తమ సంస్థకు దక్కిందని, ఏడాది పాటు కాంట్రాక్టు ప్రాతిపదికపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం కోసం సిబ్బంది పెద్ద సంఖ్యలో అవసరం అవుతారని చెబుతూ నిరుద్యోగులకు ఉద్యోగాల పేరిట ఓపెన్ ఆఫర్ ఇస్తోంది. ఇందుకు గాను స్కిల్ ట్రైనర్(కంప్యూటర్ ఫ్యాకల్టీ)కు నెలకు రూ.18వే లు, స్కిల్ అసిస్టెంట్(అటెండర్ స్థాయి) రూ.15వేల చొప్పున వేతనం చెల్లించడం జరుగుతుందని నిరుద్యోగులను బుట్టలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు కేటగిరీల్లో ఉన్న ఈ ఉద్యోగాలకు ఒక్కో దానికి ఒక్కో రకంగా నిర్ణయించి డబ్బులు గుంజేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో కంప్యూటర్ ఫ్యాకల్టీ ఉద్యోగానికి రూ.లక్ష 30వేల నుంచి రూ.1.50లక్షలు నిర్ణయించగా, స్కిల్ అసిస్టెంట్ ఉద్యోగానికి రూ.లక్ష, ఏజెంట్ కమిషన్ రూ.10వేలు అదనంగా ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఆమోద ముద్ర వేసింది.

పీఎం శ్రీ పథకంలో భాగంగానే..

దేశంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2022లో ప్రారంభించిన పీఎం శ్రీ పథకంలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 825 హైస్కూల్స్‌ను గుణాత్మక విద్యను అందించడం కోసం ఎంపిక చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 60:40 నిష్పత్తి భాగస్వామ్యంతో ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, నూతన విద్యా విధానానికి అనుగుణంగా శిక్షణ, సాంకేతిక విద్య, ప్రయోగాత్మక విద్యను అందిస్తారు. అంతేకాదు పిల్లల దేహదారుఢ్యత, మానసిక, శారీరక వికాసానికి క్రీడలు, యోగా వంటి అంశాలను కూడా బోధిస్తారు. ఐదు సంవత్సరాలపాటు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో భాగంగానే ప్రతి జిల్లాకు 25 హైస్కూళ్లను ఎంపిక చేయగా ఇందులో కంప్యూటర్ విద్యను బోధించడం కోసం ఫ్యాకల్టీని, వ్యాయామ విద్య, క్రీడలు, యోగ శిక్షణ కోసం ఒక అసిస్టెంట్ నియామకం జరపాలని నిర్ణయించారు. ఈ రెండు ఉద్యోగాలను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించనుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ రంగంలో అనుభవం ఉన్న ఏజెన్సీలకు కాంట్రాక్టు ఇవ్వనుంది. ఈ లెక్కన 33 జిల్లాల్లోని 825 పాఠశాలల్లో 1,650 ఉద్యోగాలకు సదరు ఏజెన్సీలే సిబ్బందిని నియమించి పర్యవేక్షణ జరపాల్సి ఉంటుంది. ఇందుకుగాను ప్రతి జిల్లాకు ఒక కోఆర్డినేటర్‌ను కూడా నియమిస్తారని చెబుతున్నారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా ఒక్కొక్క పాఠశాలకు రూ.2కోట్ల బడ్జెట్‌ను కేటాయించగా అందులో నుంచే ఈ శిక్షకులకు వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కాంట్రాక్టు దక్కించుకున్న ఒక ఎన్జీవో ప్రతి జిల్లాలో 10 నుంచి 12 మంది కమిషన్ ఏజెంట్లను నియమించుకొని నిరుద్యోగుల వేటలో పడింది. ఈక్రమంలో ఉద్యోగాలను ఆశిస్తూ పలువురు నిరుద్యోగులు ఎలాగైనా వాటిని దక్కించుకోవాలన్న ఆత్రుతలో అడిగినంత ముట్ట చెప్పేందుకు ఏజెంట్లను సంప్రదిస్తున్నారు.



Procs.Rc.No.1282/TSS/T8/2024. Govt.Memo.No.251/Prog.11/A2/2024.

SUBJECT: Appointment of Volunteer SKILL ASSISTANT for under program by Department of School Education & Literacy Ministry of Education Govt of India.

Respected Sir / Madam,

We are Pleased to inform you that Ms/Mrs. PASUNURI MOUNIKA D/O UPENDER ...

- When the letter is given to you,you will have to report for duty within Seven days.

The code of conduct is as follows:-

ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ యువతి పేరిట ఉన్న ఈ పత్రం నియామక పత్రమంటూ ఏజెంట్ల ద్వారా నిరుద్యోగులకు సర్క్యులేట్ అవుతోంది..

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 23: ప్రజా ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాదివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 21మంది బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత సమస్యలపై సత్వరమే స్పందించి బాధితులకు వెంటనే న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారమివ్వాలి

భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు



ప్రజలకు సూచనలు చేస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), సెప్టెంబరు 23: శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే సహించబోమని భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు హెచ్చరించారు. సోమవారం భూపాలపల్లి పట్టణంలోని బాంబులగడ్డ, సీఆర్‌నగర్ కాలనీల్లో సీఐ నరేష్‌కుమార్ నేతృత్వంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతీ ఇంటిని తనిఖీ చేసి వివరాలు ఆరా తీశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కాలనీల్లో అనుమానిత, కొత్త వ్యక్తులెవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కొంత మంది ఇక్కడ ఇళ్లను నిర్మించుకొని వేరేచోట నివాసముంటున్నారని, ఇక్కడి ఇళ్లను తెలియని వ్యక్తులకు కిరాయికి ఇస్తే వారు

మిగతా 8లో...

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- ములుగు కలెక్టర్ దివాకర



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 23: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని ప్రజల నుంచి 73 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి సంబంధించిన దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం అంశంపై కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, వాటికి గల కారణాలు, పరిష్కరించేందుకు సిద్ధం చేసుకున్న ప్రణాళిక వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, డీసీవో సర్దార్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఈవో పాణిని, సీపీవో ప్రకాష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులపై సత్వరమే స్పందించాలి

ప్రజావాణిలో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



ప్రజావాణిలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 23: ప్రజల నుంచి వచ్చే వినతులను జవాబుదారితనంతో సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నందున మండల పరిధిలో పరిష్కారం అయ్యే సమస్యలను తహసీల్దార్ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాభవన్ నుంచి వచ్చిన 49 దరఖాస్తులపై ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం కోసం అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే దరఖాస్తుల పరిష్కార వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. కాగా, సింగరేణి ఉపరితల గనుల నుంచి బొగ్గు తీసేందుకు జరుగుతున్న పేలుళ్ల వల్ల తమ ఇళ్లు దెబ్బతింటున్నాయని భూపాలపల్లి మునిసిపాలిటీలోని శాంతినగర్ ప్రజలు కలెక్టర్ రాహుల్‌శర్మకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

అక్కడే ఉండు నేనే వస్తా..

పోలియోతో రెండు కాళ్లు కోల్పోయిన దివ్యాంగుడు ప్రజావాణిలో తన మొర వినిపించేందుకు రాగా, కలెక్టరే స్వయంగా వచ్చి సమస్య తెలుసుకున్న ఘటన సోమవారం ప్రజావాణిలో చోటుచేసుకుంది. మహాముత్తారం మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన జాడి రాజయ్య పోలియోతో రెండు కాళ్లు కోల్పోయాడు. తనకు చార్జింగ్ వాహనం ఇప్పించాలని కలెక్టర్‌ను కోరేందుకు ప్రజావాణికి వచ్చాడు. కలెక్టర్ వద్దకు వెళ్లేందుకు స్టేజీ మెట్లు ఎక్కేందుకు ఇబ్బందిపడటం చూసిన కలెక్టర్ రాహుల్‌శర్మ స్వయంగా వచ్చి బాధితుడి నుంచి ఫిర్యాదును స్వీకరించారు. వెంటనే స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు.

మళ్లీ చిరుత సంచారం..?



చిరుతదిగా భావిస్తున్న పాదముద్ర

మదనపల్లి అడవిలో ఆనవాళ్లు గుర్తించిన రైతులు

పరిశీలన జరుపుతున్న అటవీశాఖ అధికారులు

ములుగు, సెప్టెంబరు 23: ములుగు మండలంలోని మదనపల్లి అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించడం కలకలం రేపుతోంది. సోమవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పాదముద్రలను గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈనెల 2వ తేదీన ఇదే ప్రాంతంలో చిరుత పాదాలను పోలిన ఆనవాళ్లు బయటపడ్డాయి. ఆ పాదముద్రల ఆధారంగా పులివేనని నిర్ధారించుకున్న అధికారులు దానికదలికలపై నిఘా పెట్టారు. పాకాల రిజర్వు ఫారెస్టు నుంచి తప్పిపోయి వచ్చిన పులి రెండు రోజుల తర్వాత తిరుగుదారిన వెళ్లినట్లు తెలిపారు. కానీ, మళ్లీ ఇదే ప్రాంతంలో 21 రోజుల తర్వాత ఆనవాళ్లు కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి పాదముద్రలను పరిశీలించారు. దాని కదలికలను ట్రాక్ చేస్తున్నారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధం

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి - సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23: జమిలీ ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం దీని ద్వారా ప్రజలకు ఏం లాభమో చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఇంట్లో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరిపినా అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు జరపడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయించేందుకే కేంద్ర ప్రభుత్వం జెమిలీ ప్రతిపాదనలు తీసుకువస్తుందన్నారు. కులగణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడం అమానుషమన్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతపై తమకు అభ్యంతరం లేదన్నారు. పేదల ఇండ్లను కూల్చివేస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రూ. 1400 కోట్లతో నిర్మిస్తున్న ఎల్కతుర్తి-రామాయణపేట హైవే నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలన్నారు. ఈ నెల 26న హైవేపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ అందరి రైతులకు అందడం లేదన్నారు. ఇటీవల వియత్నాం దేశ పర్యటనకు వెళ్లి వచ్చిన చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావును సీపీఐ నాయకురాలు మంచాల రమాదేవి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, బీ సంపత్, అశోక్, స్టాలిన్, రమాదేవి, రామచంద్రారెడ్డి, తిరుపతి, ఆదరి రమేష్, మార్పు సంజీవరెడ్డి, గడ్డం రాజనర్సు, కృష్ణారెడ్డి, రొంటాల శ్యామ్, వేల్పుల చరణ్, రవితేజ, బీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణానికి రూ. 60 కోట్ల నిధులు

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, సెప్టెంబరు 23 : హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్లు, పలు బ్రిడ్జీల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 60కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ ఎంఆర్ఆర్ గ్రాండ్ల కింద రూ. 10కోట్లు, పంచాయతీరాజ్ సీఆర్ఆర్ గ్రాండ్ల కింద రూ. 50కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలం మల్లారం ఎక్స్ రోడ్ నుంచి రసూల్‌పల్లిలో రూ. 86లక్షలతో బీటీ రోడ్, భీమదేవరపల్లి మండలంలోని అవల్దార్‌పల్లి ఆర్అండ్‌బీ రోడ్ నుంచి ఎర్రబెల్లి వరకు రూ. 37లక్షల బిటీ రోడ్, గట్లనర్సింగాపూర్, లంబాడితండ ఎక్స్ రోడ్ వరకు రూ. 374లక్షలు, ముల్కనూర్ ఎస్‌బీహెచ్ నుంచి కొత్తపల్లి ఎక్స్ రోడ్ వరకు రూ. 135లక్షలు, భీమదేవరపల్లి మండలం కొప్పూర్ ఎక్స్ రోడ్‌కు రూ. 117లక్షలు, మండలంలోని వంగర ఎర్రగడ్డ కల్వర్టు నిర్మాణం, బ్రిడ్జీ నిర్మాణానికి రూ. 80లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటితో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23 : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు సోమవారం ముగిసాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన చెస్ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 100మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. రెండు రోజుల పాటు క్రీడాకారుల మధ్య నువ్వా నేనా అనే విధంగా గెలుపే లక్ష్యంగా పోటీ తత్వాన్ని ప్రదర్శించారు. బాలుర విభాగంలో జి. విద్యాధన్, ఎం. అభినవ్ రెడ్డి, అల్లాడి శ్రీవాత్సవ్, డి. జితేష్ బాలికల విభాగంలో జాన్వీ తోట, పి. లక్ష్మీశార్వాణి, కె. ఆరాధ్య, ఎం. హాస్య లు అత్యుత్తమ ప్రతిభతో రాణించి అక్టోబరు చివరి వారంలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని కన్నా వెల్లడించారు. ఈ మేరకు విజేతులుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం

అస్ట్రేలియా అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23: కాకతీయ యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు అరుదైన అవకాశం లభించింది. అక్టోబరు 3,4 తేదీల్లో అస్ట్రేలియా ఖండంలోని పెర్త్ నగరంలో జరిగే ప్రతిష్ఠాత్మక అట్లాంటిక్ ఫెడరేషన్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. సదస్సులో ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ' మ్యాథమేటికల్ టెక్నిక్స్ ఇన్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్ (ఐసీఎంటీఈఏ-24) ఏ సోల్యూషన్ టూ పజి స్టోకాస్టిక్ లీనియర్ సిస్టమ్స్ యూజింగ్ ట్రయాంగులర్ అండ్ స్క్యూసిమెట్రిక్ స్ప్లిటింగ్ ఇంటరేటివ్ మెథడ్' అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ .మల్లారెడ్డి, మ్యాథ్స్ విభాగం ప్రొఫెసర్లు భారవిశర్మ, సోమయ్య, తిరుమలదేవి అభినందించారు.

ఇద్దరు సీఐలు, ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 23: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ సోమవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలు ఎం.అబ్బయ్య సీసీఎస్ వరంగల్ నుంచి నర్మెట్ట, ఎం.సాయిరమణ నర్మెట్ట నుంచి దుగ్గొండి అలాగే ఎస్ఐలు చింత రాజు ఇంతజార్‌గంజ్ నుంచి కొడకండ్ల, ఎస్.రాజన్‌బాబు వరంగల్ ట్రాఫిక్ నుంచి జనగాంకు బదిలీ అయ్యారు.

ఫాంహౌస్ పాలన కాదు మాది ప్రజాపాలన

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వంగపహాడ్‌లో పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభం



వంగపహాడ్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 23 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఫాంహౌస్ నుంచి మానిటరింగ్ చేసిన ప్రభుత్వం మాది కాదని ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నుకోబడిన నిజమైన ప్రభుత్వం మాది అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్‌లో పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనం, గోదామును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతిగా పని చేస్తున్నా కొందరు బీఆర్ఎస్ నాయకులు, ట్విట్టర్ వేదికగా కామెంట్స్ చేయడం సరైంది కాదని మండి పడ్డారు. గత ప్రభుత్వాలు రైతులకు రుణమాఫీ చేయాలంటే అష్టకష్టాలు పడేవారని కాం గ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సారే రూ. 2 లక్షల రుణ మాఫీ చేశాడని గుర్తు చేశారు. ఇంకా కొందరు రైతులకు రుణమాఫీ విషయంలో కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని త్వరలో పరిష్కారం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్‌లో ట్వి ట్టర్ టిల్లు, కౌశిక్‌రెడ్డి వంటి అటెన్షన్ డైవర్షన్ బ్యాచ్ పని చేస్తుందని గుర్తు చేశారు. సోషల్ మీడియా వేదికగా దుర్ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు.

టెక్సాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం వంగపహాడ్ పీఏసీఎస్ ఏపీబీ బ్యాంకు నుంచి డీసీసీబీకి మార్చమని పాలక వర్గం సభ్యులు చాలా సార్లు కోరారని అతి త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రుణమాఫీ కానీ రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదని అందరికి న్యాయం జరుగుతుందన్నారు. దసరా కానుకగా రైతులు పండించే వరి ధాన్యానికి రూ. 500 బోనస్, రైతు భరోసా ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పీఏసీఎస్ భవనం రూ. 30 లక్షలతో నిర్మాణం జరిగిందని చైర్మన్ మేరుగు రాజేశ్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీవో నీరజ, డీసీసీబీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, వంగపహాడ్ పీఏసీఎస్ డైరెక్టర్లు రుద్రారపు రాజు, మేరుగు రేణుక, గండు అశోక్ యాదవ్, పావం జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ టాప్ శాస్త్రవేత్తలలో

వరంగల్ ప్రొఫెసర్‌కు చోటు



డాక్టర్ రమేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23: ప్రపంచ టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో వరంగల్ జిల్లా నర్సంపేట మెడికల్ కళాశాల బయోకెమిస్ట్రీ ఇన్‌చార్జి విభాగం అధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు చోటు దక్కింది. ఇటీవల స్టాన్ ఫర్డ్, కాలిఫోర్నియా, ఎన్సివియర్ విశ్వవిద్యాలయాలు కలిసి ప్రపంచంలోని టాప్ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాను రూపొందించాయి. ఈ జాబితాలో డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు స్థానం దక్కింది. 2021-2023 కొనసాగే ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించారు. న్యూరో సర్జరీ, న్యూరో శాస్త్రంపై అనేక పరిశోధనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న ఏకైక వ్యక్తిగా నిలిచారు. అమెరికాలోని నాసా, ఏమోరి యూనివర్సిటీ, జార్జియా టెక్ యూనివర్సిటీ, టెక్సాస్ విశ్వవిద్యాలయం లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేశారు. డాక్టర్ రమేశ్ 100కు పైగా పరిశోధన పత్రాలను, అల్జీమర్స్, స్క్రిజోఫినియా, ఆంటి వ్యాధులపై ప్రచురించారు. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల జాబితాలో స్థానం దక్కించుకున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌ను పలువురు ఐఎంఏ వైద్యులు ప్రశంసించారు.

కొనసాగుతున్న ఉత్కర్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 23 : కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక ఉత్సవం ఉత్కర్ష 24 కార్యక్రమం మూడవ రోజు ఉత్సాహంగా కొనసాగింది. సోమవారం ఇంపల్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సైక్లింగ్, పరుగెత్తడం, జంపింగ్, క్లైంబింగ్, ఇతర క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. క్రికెట్ ఫైనల్స్‌లో పోస్టు గ్రాడ్యుయేట్లు చాంపియన్‌షిప్‌ను గెల్చుకున్నారు. సాయంత్రం విద్యార్థులు చిత్రలహరి (షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్) ఇందులో మెడికల్ విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించారు. కాకతీయ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు డాక్టర్ భరత్, డాక్టర్ మౌనిక దంపతుల కూతురుకు ఉత్కర్ష అనే పేరు పెట్టారు. కేఎంసీలో మాకు చాలా నేర్పిందని, కాలేజీ మీద ఉన్న ప్రేమతో తమ కూతురికి ఉత్కర్ష అనే పేరును పెట్టినట్లు వారు తెలిపారు. మంగళవారం విద్యార్థులు మెగా రక్తదాన శిబిరం, సాయంత్రం కార్నివల్ నైట్ నిర్వహించనున్నారు.

పలు రైళ్లు ఆలస్యం

కాజీపేట, సెప్టెంబరు 23 : కాజీపేట టౌన్ - హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య ఎఫ్ క్యాబిన్ వద్ద సోమవారం మూడో లైన్ బైపాస్ పనులు చేపట్టారు. రైల్వే అధికారులు పర్యవేక్షణలో 400 మంది గ్యాంగ్‌మెన్‌లు ఒక యూనిట్‌గా ఏర్పడి లాకింగ్, ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టారు. నాలుగు గంటలు బ్లాక్ తీసుకుని ఈ పనులు చేపట్టడంతో కాజీపేట, బల్లార్షా, వరంగల్ రైల్వే స్టేషన్ల మార్గంలోని పలు రైళ్లు అలస్యంగా నడిచాయి. పనుల అనంతరం రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఈ పనులు డిప్యూటీ సీఈ భార్గవ్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ భటియా, టీఐ అగ్గి రవీందర్, పీడబ్ల్యూ గోపిల పర్యవేక్షణలో చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

'నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ప్రయోజనాలు'

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : నూతన జాతీయ పెన్షన్ స్కీంతో ఉద్యోగులకు ఎన్నో ప్రయో జనాలు ఉన్నాయని ఏపీ రాజమండ్రి ఆదికవి నన్నయ్య వర్సిటీ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఉద యభాస్కర్ అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో అకూట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి అధ్యక్షతన నేషనల్ పెన్షన్ స్కీంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేసిన ఉదయభాస్కర్ మాట్లాడుతూ. ప్రతి ఒక్క ఉద్యోగి తప్పనిసరిగా ఎన్‌పీఎస్‌లోకి మారాలని ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వం అడిట్ అభ్యంతరాలను వ్యక్తం చేస్తోందని సూచించారు. 80 సీడీసీ కింద ఐటీ కోసం ఎన్‌పీఎస్ అవసరం ఉంటుందని చెప్పారు. అనంతరం వర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు డాక్టర్ మామిడాల ఇస్తారి, వల్లాల తిరుపతి, పోలేపాక కోర్నేల్‌లు మాట్లాడుతూ.. వర్సిటీలో ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటీవ్ అధికారులు తమను ఎన్‌పీఎస్‌లోకి మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కామర్స్ విభాగం ప్రొఫెసర్ రాజేందర్ నలుగురితో కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ సదస్సులో వర్సిటీ ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

‘రామప్ప’ భద్రత.. గాలిలో దీపమేనా?

- రూ.కోట్లలో అభివృద్ధి పనులు.. అయినా కరువైన రక్షణ
- ప్రపంచ స్థాయి గుర్తింపున్నా కానరాని సీసీ కెమెరాలు
- నిర్వహణపై భక్తుల నుంచి వ్యక్తమవుతున్న ఆక్షేపణలు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23 : యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి రక్షణ కరువైంది. పర్యాటకంగా ప్రపంచ పటంలో ఉన్నత స్థానం పొందినా స్థానికంగా మాత్రం ఈ వారసత్వ సంపదకు రక్షణ కరువైంది. ఇక ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న 20 ఉప ఆలయాల భద్రత గాలిలో దీపంగా మారింది. రూ.కోట్లు వెచ్చించి రామప్పను అభివృద్ధి చేస్తున్నా రక్షణ కల్పించడంలో మాత్రం అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది. తాజాగా గొల్లాలగుడి తవ్వకాలే ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న రామలింగేశ్వరుడి రక్షణపై భక్తుల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.

వీఐపీలు వచ్చినప్పుడే రక్షణ

సుప్రసిద్ధ రామప్ప దేవాలయానికి 2022 జూలైలో యునెస్కో గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు రావడం కోసం కేంద్ర పురావస్తుశాఖ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టాయి. గుర్తింపు తీసుకొచ్చేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. గుర్తింపు వచ్చాక రాష్ట్రపతి మొదలు అనేక మంది వీవీఐపీలు రామప్పను సందర్శించిన సమయంలో మాత్రమే పోలీసులు రక్షణగా వస్తున్నారు. ఆ తరువాత మళ్లీ యథావిధిగా రామలింగేశ్వరుడికి రక్షణ కరువవుతోంది.

ఉప ఆలయాలనూ గాలికొదిలేశారు..

రామప్ప ఆలయానికి అనుబంధంగా 20 ఉప ఆలయాలు, ప్రధాన ఆలయాలు చుట్టుపక్కల ఉన్నాయి. వాటి రక్షణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. ఫలితంగా గొల్లాలగుడిలో గుర్తుతెలియని దుండగులు తవ్వకాలు చేపట్టారు. ఏకంగా 1000కిలోల బరువు ఉన్న నక్షత్రాకారపు ప్రాకారాన్ని పైకప్పు కిందికి తోశారు. కిందకు తోశాక ప్రాకారం పైభాగంలో పుష్పాకారంలో ఉన్న టంకాన్ని పగులగొట్టారు. ఇదంతా ఒకరిద్దరు కలిసి చేసిన పనికాదని జరిగిన ఘటనను పరిశీలిస్తే తెలుస్తోంది. స్థానికుల సహకారం ఉంటే తప్ప ఇంత బరువును కిందికి తోయలేరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం కనుక ఈఘటనను సిబ్బంది చూసి ఉండకపోతే దుండగులు మరికొన్ని ఉప ఆలయాలపై కూడా ఇదే తరహాలో దాడులకు పాల్పడి ఉండేవారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనులు చేస్తున్నా సీసీ కెమెరాలు కరువు

యునెస్కో గుర్తింపు పొందిన అనంతరం రామప్ప పరిసర ప్రాంగణంలో రూ.కోట్లు వెచ్చించి చేస్తున్న పలు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అటు కాంట్రాక్టర్లు కానీ, ఇటు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ పర్యాటకులకు ఏదైనా ఇబ్బంది ఏర్పడితే కనీసం గుర్తించేందుకు సీసీ కెమెరా లు కూడా లేవు. పైగా ఆలయం వద్ద ఇలాంటి సెక్యూ రిటీని కూడా నియమించకపోవడం పట్ల సర్వత్రా వి మర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ గుర్తింపు వచ్చినా ఇంకా అభద్రతలోనే రామప్ప ఆలయం ఉంద ని స్థానికులు వాపోతున్నారు.

టంఖంలో వజ్రాలు ఉన్నాయనే..

రామప్ప ఆలయానికి సమీపంలోని గొల్లాలగుడిలో రెండురోజుల క్రితం గుప్తనిధుల కోసం తవ్వకాలు జరి గినట్టు వెలుగులోకి వచ్చిన క్రమంలో ఆలయం పై భాగంలో ఉన్న పుష్పాకారపు పైకప్పు భాగంలో ఉన్న టంఖాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఆటంఖంలో వజ్ర, వైఢూర్యాలు ఉన్నాయనే ఆశతో కొందరు వ్యక్తు లు దానిని పగులగొట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పైభాగం నుంచి కిందికి తీసుకురావడానికి సుమారు 10మంది ప్రయత్నంచేస్తే తప్ప ఆ ప్రకారం కిందికి వచ్చే అవకాశంలేదని స్థానికులు భావిస్తున్నారు.

20 ఉప ఆలయాల పరిస్థితీ అంతే


రామప్ప దేవాలయం ఆవరణలోని గొల్లాలగుడి


దీపశిఖలతో చెక్కిన టంఖం

రామప్ప గుడులకు రక్షణ కల్పించాలి

ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు, రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్



రామప్ప ప్రధాన ఆలయం తోపాటు దాని పరిధిలో ఉన్న గుడులను వెలికితీసి వాటికి ర క్షణ కవచాలను ఏర్పాటు చేసి ఆలయాలకు భద్రత కల్పించా లి. గొల్లాలగుడి పైకప్పు దీప శిఖలో అనేక కళాకృతులు చెక్కి ఉండేవి. అలాంటి అనేక కళాకృతులు మరుగునపడి ఉన్నాయి. వాటి ని నియంత్రిత రక్షణ వ్యవస్థ పరిధిలో ఉంచాలి. అలాగే పురావస్తుశాఖ రక్షణ, నిర్వహణ సిబ్బంది ని పెంచాలి.

ప్రధాన ఆలయంపై కన్నేస్తే ఇక అంతే..

రామప్ప ప్రధాన ఆలయం పరిధుల్లో దుండగులు ఎలాంటి తవ్వకాలు చేపట్టినా అంతర్జాతీయ పర్యాటక సమాజం ముందు తలదించుకోవాల్సి వస్తుంది. కనీస స్థాయి భద్రత కల్పించకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. ప్రపంచ పర్యాటక ముఖచిత్రంలో ఉన్న త స్థానం సంపాదించిన రామప్పకు ఇప్పటికైనా రక్షణ కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

గొల్లాలగుడిని సందర్శించిన కలెక్టర్ దివాకర

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 23: మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు, గొల్లాల గుడిని సోమవారం ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామప్ప దేవాలయం తూర్పు రోడ్డు అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ఏరియా మ్యాపింగ్ సర్వేచేసి బౌండ్రీ పిల్లర్ ఫిక్స్ చేయాలన్నారు. కెనాల్‌కు సంబంధించిన ఏరియా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయన రామప్ప ఉప ఆలయాల్లో ఒకటైన గొల్లాలగుడిని సందర్శించి గుడి పైకప్పు, దెబ్బతిన్న శిఖరం, పైకప్పులో వికసించే తామరపువ్వు గుర్తుతో ఉండి పూర్తిగా ధ్వంసమైన శిల్పాన్ని పరిశీలించారు. దేవాలయం పూర్తి వివరాలను పురావస్తు శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దేవాలయంలో ధ్వంసమైన శిల్పం, పువ్వు, అన్ని డాక్యుమెంట్ చేయాలని, రాత్రి కాపలాదారుడిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ అధికారి మల్లేశం, ఇరిగేషన్ డీఈ రవీందర్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో రాజు, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


ధ్వంసమైన శిల్పాలను పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర


ప్రాజెక్టు పనుల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చిన్న కాళేశ్వరంపై చిగురిస్తున్న ఆశలు

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్, కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాలకు సాగునీరు అందించేందుకు గాను చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. సుమారుగా 45వేల ఎకరాల పంట భూములకు నీరందించేందుకు ప్రాజెక్టు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ చూపి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష జరిపి చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 70వేల ఎకరాల భూ సేకరణకు రూ.14 కోట్లు, వీరసాగర్‌లో సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరాకు రూ.31.39 కోట్ల నిధులు మంజూరైనట్లు ఈఈ యాదగిరి తెలిపారు. ప్రస్తుతం ఈఈ పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

నేడు కాళేశ్వరానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాక

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి సన్నిధికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, కమిషనర్ హన్మంతరావులు మంగళవారం రానున్నారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధానంలో సరస్వతి పుష్కరాలపై సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే సరస్వతి పుష్కరాల సమావేశాలు నిర్వహించడానికి ముందస్తుగా కాళేశ్వరంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. అలాగే రూ.25 కోట్లతో 8ఏళ్ల క్రితం మంజూరైన పనులపై కూడా ఆరా తీసినట్లు తెలిసింది.

30న విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: హంటర్‌రోడ్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఈ నెల 30న పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో డి. వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయిలో విజేతలైన విద్యార్థులు దక్షిణ భారత స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొంటారని, అక్కడ విజేతలైన విద్యార్థులు జనవరి 2025లో బెంగుళూరులో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామిని సంప్రదించాలని ఆమె సూచించారు.

బోగస్ పాలనతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారు

- ప్రజల అభిప్రాయాలను పట్టించుకోలేదు
- ఇప్పటి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం
- కేయూ సింపోజియంలో సామాజిక వేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న హరగోపాల్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కేసీఆర్ పాలనంతా బోగస్‌గా సాగిందని, తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ప్రముఖ సామాజిక వేత్త, రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బానోతు సురేశ్‌లాల్ అధ్యక్షతన ‘డికెడెల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ ఇష్యూస్ చాలెంజేస్’ అనే అంశంపై సింపోజియం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలందరూ ఉద్యమం చేసి ఆశించిన డెమోక్రటిక్ పాలిటిక్స్‌కు బదులుగా విరుద్ధమైన పాలన సాగించారని విశ్లేషించారు. బీఆర్ఎస్ పాలన నిర్బంధం, నిరంకుశత్వంతో పాలన సాగించిందన్నారు. కేసీఆర్ పాలనలో అక్రమంగా 221 కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీసీ వర్సిటీలకు భారీగా నిధుల్లో కోత విధించిందని, వర్సిటీ స్వయం ప్రతిపత్తిని ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

ప్రత్యేక అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అప్పట్లో అధికారం చేపట్టగానే తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు, వలసలతో పాటు అస్తిత్వం కోల్పోయిన యువత ఆకాంక్షలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే తమది పక్క రాజకీయ పార్టీ అంటూ రాష్ట్రం కోసం పోరాడిన మేధావులు, యువత, విద్యావేత్తల ఆలోచనలు పట్టించుకోలేదని అన్నారు. ఖరీఫ్‌లో రైతుల పేరుతో నమోదైన భూములను ధరణి పోర్టల్‌లో సాయంత్రం పని ప్రారంభించి రాత్రికి తమకు అనుకూలమైన పేర్లకు మార్చేవారని అన్నారు. కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలోని మిగతా నీటి ప్రాజెక్టుల్లో అవకతవకలు, అవినీతి జరిగిందన్నారు. కేసీఆర్ తన హయంలో రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని ధ్వజమెత్తారు. సెంట్రల్ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి కీలక ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రం నీళ్ళు, నిధులు, నియామకాల కోసమే అంటూ ప్రగల్భాలు పలికినప్పటికీ తీర రాష్ట్రం సిద్ధించిన తర్వాత వాటిని మరిచారని అన్నారు. తమిళనాడుతో పోలిస్తే తెలంగాణలో విద్య ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. అర్థశాస్త్రంలో దత్తాంశాల ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. వర్సిటీల్లో ఫ్యాకల్టీతో పాటు నిధుల కొరత ఉందన్నారు. పాలక మండలి సభ్యులు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ.. వరంగల్‌లో డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధి హైదరాబాద్‌లో కేంద్రీకృతం కాకుండా రాష్ట్రమంతా విస్తరించాలని చెప్పారు.

కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి, సమస్యలు, సవాళ్ళకు సరైన మార్గదర్శనంగా సింపో జియం నిర్వహించినట్లు తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు, కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ గుగులోత్ వీరన్ననాయక్, ప్రొఫెసర్ సీహెచ్. సమ్మయ్య కృష్ణమాచారి, పరిశోధకులు జి.రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల నియామకానికి త్వరలో నోటిఫికేషన్?

- సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన వీసీ
- ‘ఆంధ్రజ్యోతి’ కథనానికి స్పందన

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 23 : కాకతీయ యూనివర్సిటీలో ఏడేళ్లుగా పార్ట్‌టైం అధ్యాపకుల నియామక నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం, వర్సిటీలో విద్యార్థులకు బోధన సక్రమంగా జరగకపోవడం, విద్యార్థులు పడుతున్న పలు ఇబ్బందులను వివరిస్తూ ‘పాఠాలు చెప్పే వారేరీ’ శీర్షికన సోమవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనానికి వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి.. సమస్య గురించి రాష్ట్ర ఉన్నతా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లతో త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ మేరకు తమకు వీసీ నుంచి సమాచారం అందిందని వర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌లు, పార్టుటైం ఆశావాహులు తెలిపారు. సోమవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనాన్ని తాము రిజిస్ట్రార్ వద్దకు తీసుకెళ్లామని, వర్సిటీలో ఉన్న పరిస్థితులను విన్నవించామని, రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్పందించి.. పార్టుటైం నోటిఫికేషన్ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వీలైనంత త్వరగా ఉన్నతాధికారుల అనుమతిలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదిలా ఉండగా సోమవారం వర్సిటీ సెనెట్ హాల్‌లో జరిగిన అర్థశాస్త్ర విభాగం సింపోజియంలో వర్సిటీల్లో పార్టుటైం నియామకాల్లేవనే అంశాన్ని పలువురు మాట్లాడారు. వర్సిటీలో అధ్యాపక నియామలు చేపట్టకపోవడంతో ఒక తరానికి నష్టం చేసినట్లేనని ఆందోళన వ్యక్తం చేశారు.

స్పందించిన ఎమ్మెల్సీ కోదండరాం..

సోమవారం వర్సిటీకి వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన పీహెచ్‌డీ డాక్టరేట్లు, ఆశవహులు ‘ఆంధ్రజ్యోతి’లో సోమవారం ప్రచురితమైన కథనాన్ని చూపించారు. సమస్యలను విని స్పందించిన కోదండరాం వెంటనే వర్సిటీ క్యాంపస్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో చర్చించారు. పార్ట్‌టైం నోటిఫికేషన్ విడుదలకు ఉన్న ఇబ్బందులపై ఆరా తీశారు. రాష్ట్ర ఉన్నత విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణల దృష్టికి తీసుకెళ్లి పార్టుటైం నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. దాంతో తాము ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలపై దృష్టి సారించామని.. వీలైనంత త్వరగా ఇస్తామని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ వర్సిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపల్లి మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత డాక్టర్ పాలమాకుల కొమురయ్య, బీఆర్ఎస్వీ వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి రంజిత్, డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌లు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రాన్ని అందచేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.


కోదండరాంకు వినతి పత్రాన్ని ఇస్తున్న వర్సిటీ డాక్టరేట్ అభ్యర్థులు

27న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23: జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, వరంగల్, హనుమకొండలోని అపోలో ఫార్మసీ కేంద్రాల్లో ఫార్మసిస్ట్/అసిస్టెంట్/అప్రెంటిషిప్‌గా పనిచేసేందుకు 50 ఖాళీలకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు గల డీఫార్మసీ, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ, టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు వారి జిరాక్స్ సర్టిఫికేట్లతో ఈ నెల 27న ములుగు రోడ్‌లోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి విరాలకు 78933 94393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

వరంగల్ వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు-రూ.లలో)

పంట	గరిష్టం	కనిష్టం
మక్కలు (బిల్టీరకం)	2,660	2,405
పల్లికాయ (సూక)	5,600	4,500
పల్లికాయ (పచ్చిది)	4,400	3,800
కందులు	8,059	7,575
పెసళ్లు	7,652	4,052
పత్తి	7,650	5,500
కొత్తపత్తి	7,225	6,500
పసుపు (కాడి)	13,130	12,000
పసుపు (గోల)	12,455	10,800
తేజ మిర్చి	12,500	10,000
తేజ ఏసీ	18,800	14,000
వండర్‌హాట్ ఏసీ	15,000	13,000
యూఎస్341 ఏసీ	16,500	11,000
తాలు మిర్చి	6,000	3,000

- వరంగల్ వ్యవసాయం

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో శివాత్మికకు బంగారు పతకం


శివాత్మికను విజేతంగా ప్రకటిస్తున్న న్యాయనిర్ణేతలు

హనుమకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండకు చెందిన సిహెచ్ శివాత్మిక అండర్ 17 (42 కేజీ) విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 650మంది పోటీ పడ్డారు. వీరందరిని దాటుకొని విజేతగా నిలిచిన హనుమకొండ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన శివాత్మిక నవంబర్ నెలలో ఉత్తరాఖండ్‌లో జరుగబోయే జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలలో పాల్గొనేందు కు ఎంపికయ్యారు. బంగారు పతకం సాధించిన శివాత్మికను తెలంగాణ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.ఆంజనేయులు, వైస్‌ప్రెసిడెంట్ బండారి సంతోష్, కోచ్‌లు రామ్‌చందర్, సాగర్, కర్ర వెంకటేశ్, సిహెచ్ కరుణాకర్, సీహెచ్ సుప్రియ, పి దినేష్, ఏ గణేష్, యూ రణదీప్, జి వైష్ణవి అభినందించారు.

చిలుపూర్‌లో పట్టపగలు దొంగతనం

- హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు
- ఓ ఇంట్లో చొరబడి మూడు తులాల గొలుసు చోరీ

చిలుపూర్, సెప్టెంబరు 23 : పట్టపగలు హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చిన ఆగంతకుల్లో ఒకరు ఓ ఇంట్లోకి ప్రవేశించి, ఒంటరిగా ఉన్న మహిళను కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న మూడు తులాల గొలుసుకును లాక్కెళ్ళాడు. అనంతరం బైక్‌పై ఇద్దరూ పారిపోయారు. ఈ ఘటన చిలుపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత మహిళ జంగిటి రాధిక -లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాధిక తన భర్త వివిధ పనుల నిమిత్తం వరంగల్‌కు వెళ్ళడంతో మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఇంట్లో కూర్చుని టీవీ చూస్తోంది. ఈ లోగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఇంటి ముందు ఆగారు. ఒకరు బైక్ దగ్గర ఉండగా, మరొక వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. వచ్చీరాగానే కత్తితో పొడిచి చంపుతానని మెడలో ఉన్న బంగారం ఇవ్వాలని బెదిరించాడు. అతడిని ప్రతిఘటించే ప్రయత్నం చేసిన ప్రయత్నం ఫలించకపోగా, ఆమె మెడలో ఉన్న మూడు తులాల (రూ.2.50 లక్షల విలువ గల) బంగారు గొలుసును లాక్కెళ్ళి పారిపోయారు. బాధిత మహిళ రాధిక -లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చిలుపూర్‌లో దొంగతనం జరిగిన తీరును బాధిత మహిళను అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 : నవోదయ పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు మామునూరు నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ బి. పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://navodaya.gov.in అనే వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

శ్రీపతిపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రూ. 2.15 లక్షల నగదు, 10 తులాల బంగారం, 5 తులాల వెండి అపహరణ

చిలుపూర్, సెప్టెంబరు 23 : తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 2.15లక్షల నగదుతో పాటు, 10తులాల బంగారం, 5 తులాల వెండి ఎత్తుకెళ్ళిన ఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని శ్రీపతిపల్లిలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మూడికె లక్ష్మికి భర్త కొన్నేళ్ళ క్రితం చనిపోగా, కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. కొడుకును చూడడం కోసం ఐదు రోజుల క్రితం లక్ష్మి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి సొత్తును దోచు కెళ్ళారు. సోమవారం ఉదయం ఇంటికి వెసిన తాళం పగులగొట్టడాన్ని గమనించిన సమీప బంధువులు ఆమెకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. దీంతో సమీప గ్రామంలో లక్ష్మి కుమార్తె హారిక గ్రామానికి చేరుకుంది. బీరువా తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు గుర్తించింది. సమాచారమందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్‌తో కలిసి చిలుపూర్, శ్రీపతిపల్లి గ్రామాలకు చేరుకున్నారు. దొంగతనాలు జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. దొంగలను పట్టుకోవడం కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

‘పద్మావతి’ హాల్టింగ్ అయోమయం

- నెక్కొండలో డౌన్‌కు ఓకే.. అప్‌కు నో...
- ప్రైవేట్ యాప్‌లలో తప్పుడు సమాచారంతో ప్రయాణికుల ఇబ్బందులు


ఓ యాప్‌లో నెక్కొండలో హాల్టింగ్ చూపుతున్న దృశ్యం

నెక్కొండ, సెప్టెంబరు 23 : సికింద్రాబాద్-తిరుపతి (12764 / 12763) పద్మావతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ విషయంలో ప్రయాణికుల్లో అయోమయం నెలకొంది. నెక్కొండ రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉండగా.. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే రైళ్లకు హాల్టింగ్ లేదు. ఈ క్రమంలో సికింద్రాబాద్ వైపు వచ్చే ఎక్స్‌ప్రెస్‌కు అప్ హాల్టింగ్ ఇప్పించాలని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌ను కోరారు. దాంతో మూడు నెలలుగా నెక్కొండ స్టేషన్‌లో అప్ హాల్టింగ్ ఇప్పించారు. కానీ అది మున్నాళ్ల ముచ్చటే అయింది. ఈనెల 15 నుంచి అప్ హాల్టింగ్‌ను రద్దుచేశారు. కానీ ప్రైవేట్ యాప్‌ల్లో మాత్రం నెక్కొండలో పద్మావతి అప్ హాల్టింగ్ చూపుతుండడంతో తికమకపడుతున్నారు. ఇక తిరుపతి పుణ్యక్షేత్రానికి నిత్యం వందల మంది వెళ్తుంటారు. నెక్కొండ స్టేషన్‌లో రైలు ఎక్కి తిరుపతి వెళ్లి.. తిరుగుప్రయాణంలో అదే రైల్లో నెక్కొండకు రావాలని భావిస్తున్నారు. కానీ ఈ స్టేషన్‌లో రైలు ఆగకపోవడంతో వరంగల్‌లో దిగాల్సి వస్తోంది. కొన్ని ప్రైవేట్ యాప్(ఆన్‌లైన్)లో నెక్కొండ స్టేషన్‌లో అప్ పద్మావతి హాల్టింగ్ చూపించడంతో ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 23 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం బ్యారేజీలోకి 98,440 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా, బ్యారేజీ వద్ద 2.10 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

పెండింగ్ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 23: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో ఆవేదనతో ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు కాకుండా త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అలాగే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు.

ముత్తారం క్రాస్‌రోడ్డు వద్ద పోలీసుల తనిఖీలు

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 23: మండలంలోని ఆలుబాక పంచాయతీ పరిధిలోని ముత్తారం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రం నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల నుంచి సమాచారం సేకరించి వదిలేశారు. సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాటారం, సెప్టెంబరు 23: కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భిక్షపతి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లో నాలుగో విడత వాక్-ఇన్ అడ్మిషన్ల కోసం ఈనెల 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీఎం సివిల్-24, కోపా విభాగంలో 15 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకొని వెబ్‌సైట్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా వేణు



ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 23 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ములుగు జిల్లా కార్యదర్శిగా వెంకటాపూర్(రామప్ప), జడ్పీహెచ్‌ఎస్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బలుగూరి వేణు ఎంపికయ్యారు. సోమవారం ములుగులో జరిగిన సమావేశంలో జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని వేణును జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో స్కూల్ గేమ్స్ నిర్వహణలో తన వంతు పాత్ర నిర్వహిస్తానని అన్నారు.

అదనపు బకెట్ దందాపై ఆరా!

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 23: పలిమెల, మహదేవపూర్ మండలాల్లోని పంకెన, పెద్దంపేట ఇసుక క్వారీల్లో అదనపు బకెట్ దందాపై నిఘా వర్గాలు ఆరా తీసినట్లు తెలిసింది. ఈ క్వారీలతో పాటు మహదేవపూర్ మండలంలో నూతనంగా ఏర్పాటై డంపింగ్ పూర్తిచేసుకున్న అంబట్‌పల్లి-2, 3, 4 క్వారీల్లోనూ అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. నూతనంగా ఏర్పాటైన ఈ క్వారీల్లో స్టాక్ యార్డుకు ఇసుకను మ్యానువల్ పద్ధతిలో తరలించాల్సి ఉండగా ప్రొక్లెయినర్లు, జేసీబీలతో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలించినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే పంకెన క్వారీకి చెందిన ఓ ఇసుక లారీ ఓవర్‌లోడ్‌తో ఆదివారం రాత్రి కొయ్యూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడినట్లు తెలిసింది. తరచూ ఇలాంటి కేసులు నమోదవుతుంటే అధికారులు అదనపు బకెట్ జరగడం లేదంటూ చెప్పడం చర్చనీయాంశంగా మారుతోంది.

కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి

కాకతీయఖని, సెప్టెంబరు 23: కార్మిక వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సింగరేణి ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఏరియాలోని 5 ఇంక్లైన్ మొదటి షిఫ్టు సమయంలో సింగరేణి ఉద్యోగ, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య మాట్లాడుతూ 44కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అంతేకాకుండా 33 శాతం రావాల్సిన లాభాల వాటాను 16.9 శాతం వర్తింపచేయడం దారుణమన్నారు. యువ కార్మికుల చైతన్యం, ప్రశ్నించే తత్వమే సింగరేణి కార్మికులను కాపాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాసర్ల ప్రసాద్‌రెడ్డి, శ్రీధర్, మల్లేష్, చంద్రశేఖర్, వెంకటేష్, సంపత్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో పోషక లోపాల్లేకుండా చర్యలు

▸▸ సీడీపీవో రాధిక, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ వందన

కాటారం, సెప్టెంబరు 23: చిన్నారుల్లో పోషణ లోపం లేకుండా తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు చర్యలు తీసుకోవాలని సీడీపీవో రాధిక, ధన్వాడ సబ్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ(మీడియం లెవల్ హెల్త్ ప్రొవైడర్) డాక్టర్ వందన అన్నారు. మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలోని దేవరాంపల్లి, రేగులగూడెం, గోపాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం వీహెచ్‌ఎస్‌ఎన్‌డీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ సివియర్ అక్యూట్ మాల్ న్యూట్రిషన్(స్యామ్), మోడరేట్ అక్యూట్ మాల్‌న్యూట్రిషన్(మ్యామ్) ఉన్న పిల్లలకు టీహెచ్ఆర్ డబుల్ డోస్ ఇవ్వాలన్నారు. పిల్లలు తరుచూ అనారోగ్యం పాలైతే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, వైద్యుల దృష్టికి తీసుకురావాలని డాక్టర్ వందన అన్నారు. చిన్నారులకు సకాలంలో టీకాలు ఇప్పించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలన్నారు. పిల్లల ఎత్తు, బరువు ఏ వయస్సులో ఎంత ఉండాలి.. వారు ప్రస్తుతం ఉన్న స్థితిని తెలుసుకోవడానికి కొలతల యంత్రాలతో స్క్రీనింగ్ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ, హెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, పోషణ్ అభియాన్ బీసీ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, రోజా, ఏఎన్‌ఎం రజిత, ఆశా కార్యకర్తలు జ్యోతి, సరిత పాల్గొన్నారు.



చిన్నారి బరువును కొలుస్తున్న అంగన్‌వాడీ అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మాసోత్సవాలు

మండలంలోని కొత్తపల్లి, రేగులగూడెం, శంకరంపల్లి జీపీల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్ మాసోత్సవాలు నిర్వహించారు. దేవరాంపల్లి ఏడబ్ల్యూసీలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో రాధిక పాల్గొని పిల్లల తల్లులు, గర్భిణులకు పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ వీణ, ఏడబ్ల్యూటీలు శ్రీలత, సులోచన, రేణుక, కమలాదేవి, అన్నపూర్ణ, సువర్ణ, రోజా పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

మల్హర్, సెప్టెంబరు 23: మండలంలోని కొయ్యూర్‌లో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ సోమవారం తెలిపారు. పంకెన నుంచి హైదరాబాద్‌కు ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని కొయ్యూర్ వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పరిమితికి మించి తరలిస్తే కేసులునమోదు చేస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు

మహదేవపూర్, సెప్టెంబరు 23: మహదేవపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు బండెల సత్తెమ్మ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మాజీ ఎంపీపీ రాణిబాయి, ప్యాక్స్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కటకం అశోక్, ఎండి.నయీమొద్దీన్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

టేకుమట్ల, సెప్టెంబరు 23: మండల కేంద్రంలో సోమవారం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ వీవర్ సెల్ అధ్యక్షుడు ఆడెపు సంపత్ మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు సీఎం రూ.30కోట్ల రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. తిప్ఫ పథకం కింద చేనేత కార్మికులకు రూ.290 కోట్లు మంజూరు చేసినందుకు గాను ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు పోలు రమేష్, మచ్చగిరి సారయ్య, వంగ నరేష్, దుడం రాములు, కోమాకుల చిరంజీవి, సంపత్, రాజు, రంజిత్ పాల్గొన్నారు.

విషజ్వరంతో యువకుడి మృతి

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 23 : మండలంలోని బెగ్లూర్ గ్రామానికి చెందిన పొట్లపెల్లి రామచంద్రం(24) అనే యువకుడు విషజ్వరంతో సోమవారం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రామచంద్రం నాలుగు రోజుల క్రితం జ్వరం బారిన పడగా పలువురు యువకులు ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే జ్వరం తీవ్రతరమవ్వడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు చెప్పారు. రామచంద్రం తల్లిదండ్రులు పదేళ్ల క్రితం మృతి చెందగా బంధువులు, గ్రామస్తులే అంత్యక్రియలు నిర్వహించారు.

ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రుల ఫిర్యాదు

మేడారం, సెప్టెంబరు 23: తాడ్వాయి మండలం ఊరట్టం పంచాయతీ పరిధి జంపంగవాయి గ్రామంలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయుడు ఎండి.అబిద్ అలీ మూడు సంవత్సరాలుగా విధులకు హాజరు కావడం లేదని కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 32మంది విద్యార్థులు ఉన్న ఆ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ఇందులో అఖిల్ అనే ఉపాధ్యాయుడు వస్తున్నాడని, మరొకరు ఎండి.అబిద్ అలీ రావడం లేదని చెప్పారు. మూడేళ్లుగా పిల్లలకు చదువు చెప్పే ఉపాధ్యాయుడు కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. విధులకు హాజరు కాని అబిద్ అలీని వెంటనే తొలగించి మరో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో గొంది సరిత, గజ్జల సుజాత, గజ్జల రాణి, టి.మహేశ్వరి, సర్వేశ్వరావు, నర్సింగరావు, బాబు కృష్ణ, స్వరూపరాణి పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 23: తల్లీబిడ్డలకు సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పిల్లల పెరుగుదల పర్యవేక్షణలో భాగంగా జిల్లా స్థాయిలో పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషకాహారంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా మహిళా, శిశు అభివృద్ధి శాఖలకు సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం జరగగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో పోషణ లోపంతో ఉన్న పిల్లలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఇందులో వైద్య ఆరోగ్యశాఖ, మహిళా అభివృద్ధి శాఖలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పోషకాహార లోపం, తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి వారి ఆరోగ్యాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ న్యూట్రిషన్ కన్సల్టెంట్ నర్సింహారావు, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూవో శిరీష, డీఎంహెచ్‌వో అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్, సీడీపీవోలు ప్రేమలత, ముత్తమ్మ, మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం థర్మల్‌ను జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలి

▸▸ కేటీపీపీ టీజీపీఈఏ విద్యుత్ ఉద్యోగుల డిమాండ్



కేటీపీపీ ప్రధాన ముఖద్వారం ఎదుట మాట్లాడుతున్న విద్యుత్ ఉద్యోగులు

గణపురం, సెప్టెంబరు 23: రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టును టీజీ జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. మండలంలోని చెల్పూర్‌లో గల కేటీపీపీ ప్రధాన ముఖద్వారం ఎదుట సోమవారం తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్(టీజీపీఈఏ) ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండంలో నిర్మించబోతున్న థర్మల్ ప్లాంటులో సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పుకోమని తేల్చి చెప్పారు. తెలంగాణ జెన్‌కో, సింగరేణి ఆధ్వర్యంలో 800 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు జాయింట్ వెంచర్‌గా తీసుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన టీజీ జెన్‌కో ద్వారానే థర్మల్ ప్రాజెక్టు నిర్మించాలని కోరారు. సమావేశంలో టీజీపీఈఏ యూనియన్ నాయకులు మాకుల సంతోష్, పుట్ట తిరుపతి, రాజ్‌కుమార్, నరేష్, వంశీకృష్ణ, కిషన్, శ్రీధర్, తిరుపతిగౌడ్, శంకరయ్య, ఆనందబాబు, నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, రాజు, పరమేష్, శకుంతల, లీల, శ్రద్ధానంద, లింగానాయక్, రత్నాకర్ పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం పనుల అడ్డగింత

కాటారం, సెప్టెంబరు 23: మండలకేంద్రం శివారులో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను కొందరు భూములు కోల్పోయిన రైతులు సోమవారం అడ్డగించారు. గారెపల్లి నూతన చెరువు కట్టపై కాంట్రాక్ట్ నిర్వాహకులు ఎక్స్‌కవేటర్‌తో జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తుండగా రైతులు తమకు పరిహారం ఇచ్చే వరకు పనులు చేయొద్దని కాంట్రాక్ట్ ఏజెన్సీ అధికారులతో అభ్యంతరం తెలిపారు. కొత్త చెరువు కోసం ఏళ్ల క్రితం తీసుకున్న భూములకు నేటికీ పరిహారం దక్కలేదని ఆందోళన చేశారు. దీంతో ఇరిగేషన్ డీఈ ఉపేందర్, ఏఈలు వెంకన్న, తిరుపతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న రైతులతో మాట్లాడారు. పనులు పూర్తయితే అందరికీ ప్రయోజనం కలుగుతుందని, పరిహారం రాని రైతుల గురించి కలెక్టర్‌తో జరిగే సమావేశంలో మంగళవారం చెబుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు సురేష్, రాంచంద్రం, మల్లయ్య పాల్గొన్నారు.

'సాంస్కృతికోత్సవాలను విజయవంతం చేయాలి'

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 23: సాంస్కృతిక కళా ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ముద్దమల్ల రాజేందర్ అన్నారు. పట్టణంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న కళాత్మక ప్రతిభను వెలికి తీసేందుకు, జాతీయ స్థాయిలో సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థ చేసుకోవడానికి అవగాహన వ్యాప్తి చేయడంలో భాగంగా ఈ కళా ఉత్సవ్ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. కాగా, ప్రతి పాఠశాల, హాస్టల్స్ నుంచి మ్యూజిక్, డ్యాన్స్, విజువల్ ఆర్ట్స్, థియార్టి పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. అయితే మండల స్థాయిలో ఈనెల 27లోపు నిర్వహణ జరుగుతుందని, 28నుంచి 30 వరకు జిల్లా స్థాయిలో నిర్వహించబడుతాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇందులో మొదటిసారి, రెండవసారి, మూడవసారి ఎంపిక ప్రక్రియ ఉంటుందని, గెలుపొందిన వారికి రూ.15వేల నగదు బహుమతిని అందించనున్నట్లు డీఈవో రాజేందర్ పేర్కొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

▸▸ ఐటీడీఏ ఏపీవో వసంతరావు

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 23: గిరిజన దర్బార్‌లో గిరిజనులు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో వసంతరావు అన్నారు. ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఏపీవో గిరిజనుల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 18 మంది గిరిజనులు తమ సమస్యలను ఏపీవో దృష్టికి తీసుకెళ్లారు. ట్రైకార్ ద్వారా రుణ సదుపాయం కల్పించాలని ములుగు మండలం రాయినిగూడెం గ్రామానికి గొంది రంజిత్ ఏపీవోకు విన్నవించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీగా ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగపేట మండలం కోమటిపల్లికి చెందిన పాయం సోని వినతిపత్రం అందించారు. అదేవిధంగా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తుడు చెరుకుల గోపీ ఏపీవోను కోరారు. పోడు భూములను ఆన్‌లైన్ చేసి హక్కు పత్రాలు కల్పించాలని తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన చంద్రయ్య ఏపీవోను వేడుకున్నారు. ఎస్‌వో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



దర్బార్‌లో ఏపీవోకు వినతి పత్రం అందిస్తున్న గిరిజనులు

ప్లాస్టిక్ నియంత్రణ కోసం వినూత్న ర్యాలీ

కాటారం, సెప్టెంబరు 23: మండలకేంద్రంలో ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టడానికి అధికారులు వినూత్నమైన ఆలోచనతో సోమవారం ర్యాలీ చేపట్టారు. కాటారం గ్రామపంచాయతీ కార్యదర్శి సఫీర్‌ఖాన్, జీపీ సిబ్బంది ప్లాస్టిక్ సీసాలు వేసుకున్న భూతం వేషదారుడితో కలిసి పలు వీధుల గుండా తిరుగుతూ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ మనిషి జీవితానికి ఎంత చేటు చేస్తుందో చెప్పడానికి, ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చేయడానికి, వ్యాపారులు పాలిథిన్ కవర్ల నిషేదం గురించి తెలుసుకునేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని కార్యదర్శి వెల్లడించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది శ్రీనివాస్, బ్రహ్మం, రాజయ్య, వెంకటి తదితరులు పాల్గొన్నారు.



కాటారంలో ప్లాస్టిక్ సీసాల భూతం వేషధారుడితో అధికారుల ర్యాలీ

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

మహదేవపూర్ : స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా మహదేవపూర్ మండలంలో ప్లాస్టిక్ నిర్మూలన కోసం సోమవారం స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాల గురించి మహిళా సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత : జీఎం

గణపురం, సెప్టెంబరు 23: మొక్కల పెంపకం అందరి బాధ్యత అని సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్ అన్నారు. సోమవారం రామప్ప కాలనీలో స్వచ్ఛ పక్వాడాలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ పక్వాడా 4.0లో భాగంగా రామప్ప కాలనీలో 5వేల మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా ప్రధానమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, జ్యోతి, పద్మజ, రవికుమార్, మారుతి, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయీస్ యూనియన్ కాళేశ్వరం జోన్ ఇన్‌చార్జ్‌గా రమేష్

మహదేవపూర్, సెప్టెంబరు 23: తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ కాళేశ్వరం జోనల్ ఇన్‌చార్జ్‌గా గాదె రమేష్ నియమితులయ్యారు. ఈమేరకు జాయింట్‌యాక్షన్ కమిటీ సమన్వయంతో తెలంగాణ స్టేట్ ఎంప్లాయీస్ కంట్రోల్ కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.శివప్రసాద్ తెలిపారు. కాళేశ్వరం జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన గాదె రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియామకం చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో కూలి మృతి

కన్నాయిగూడెం, సెప్టెంబరు 23: మిరప చేనులోకి మల్చింగ్ పేపర్ వేసేందుకు కూలి పనికి వెళ్లిన పొడియం జగదీష్(40) గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చింతగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గొత్తికోయగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. తోటి కూలీలు, బంధువులు తెలిపిన ప్రకారం... రోజువారి లాగే ఉదయాన్నే గ్రామంలోని రైతుకు మిరప చేనులో మల్చింగ్ పేపర్ వేసేందుకు జగదీష్‌తో కలిసి వెళ్లామని తెపారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రాణం గాబరా అవుతుందని జగదీష్ సేద తీరుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి మరణించాడని చెప్పారు. మృతదేహాన్ని ట్రాక్టర్ ద్వారా గూడెంకు తరలించారు. ఆయనకు భార్య అయితమ్మ, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

ఏటూరునాగారంలో మిర్చి క్లస్టర్ ఏర్పాటు చేయాలి

మంగపేట, సెప్టెంబరు 23: ఏటూరునాగారం కేంద్రంగా మిర్చి క్లస్టర్ ఏర్పాటు చేయాలని జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి కలెక్టర్‌ను కోరారు. కలెక్టరెట్‌లో కలెక్టర్ టీఎస్ దివాకరను సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టర్‌ను సన్మానించి రైతాంగం సమస్యలను వివరించినట్లు ఆయన చెప్పారు. ఈ విషయాన్ని మంగపేటలో విలేకరులకు వెల్లడించారు. ఏటూరునాగారం కేంద్రంగా మిర్చి పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేసి మిర్చి రైతులకు విలువ జోడింపుతో పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మిర్చి ప్రాసెసింగ్, పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఎండు మిర్చి నిలువ కోసం కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి చొరవ చూపాలని కోరినట్లు వివరించారు. షేక్ మోహినొద్దీన్, కె.సాంబశివరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిట్యాల, సెప్టెంబరు 23: మండలంలోని జడలపేట శివారు మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం... కొత్తపేట గ్రామానికి చెందిన మధురకవి దినేష్(28) ఓ ప్రైవేటు కంపెనీలో పార్సిల్ డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న మిషన్ భగీరథ ఎయిర్‌వాల్వ్‌కు బలంగా తాకడంతో దినేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్నేహితులు పరకాలలోని ప్రైవేటుఆస్పత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం హనుకొండకు తరలిస్తుండగా అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి దామోదరస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

పోడు పట్టాలకు రుణాలు ఇవ్వాలి

కాకతీయఖని, సెప్టెంబరు 23: జిల్లాలో పోడు పట్టాలకు, రెవెన్యూ కొత్త పట్టాలకు పంట రుణాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఎల్‌డీఎం శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో 5వేల కుటుంబాలు ఆర్‌వోఎఫ్‌ఆర్ పొంది ఉన్నారని, వారికి పంట రుణాలు, రైతు భరోసా వర్తించేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, రాజు, గణేష్, కుమార్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి మద్దతుగా నిలవాలి : బీజేపీ

చిట్యాల, సెప్టెంబరు 23: ప్రజలు బీజేపీ సభ్యత్వ నమోదుతో ప్రధానమంత్రి మోదీకి మద్దతుగా నిలవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిషిధర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. దేశంఅభివృద్ధి కోసం ప్రధాని మోదీ విశ్రాంతి లేకుండా నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రతీ సంక్షేమ పథకం అర్హులందరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయాలని మండల కమిటీకి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రముఖ్ డాక్టర్ రాజవర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్, గుండ సురేష్, గజనాల రవీందర్, షైదం శ్రీకాంత్, ప్రభాకర్, గుర్రపు రవి, సదానందం, రఘు, కత్తుల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 23: మండలంలోని పోతుగల్లు, మొగుళ్లపల్లి వాగుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ సునీత అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె మొగుళ్లపల్లి, వేములపల్లి, పోతుగల్లు వాగులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాగుల నుంచి ఇసుకను కొంతమంది ట్రాక్టర్ యజమానులు పరకాల, ఇల్లంతకుంట, చిట్యాల మండలాలకు తరలిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆమె వెంట ఆర్ఐ సురేందర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

(5వ పేజీ తరువాయి)

ఏదైనా నేరాలకు పాల్పడితే యజమానులు కూడా బాధ్యులవుతారని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి, గుడుంబా ఇతరత్రా మత్తు పదార్థాలను సేవించవద్దన్నారు. గంజాయి సేవించే యువత తీరులో అనేక మార్పులు వస్తాయని, స్వంత వారిపై సైతం నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై సైతం దృష్టి పెట్టాలని, మత్తు పదార్థాలు సేవించే వారి సమాచారం ఇచ్చి డీహైడ్రేషన్ సెంటర్‌కు తీసుకెళ్లాలన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, ఇటీవల కాలంలో కొత్తగా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లు చేసి మీ సంబంధీకులు నేరం చేశారని, డబ్బులు పంపిస్తే నేరం నుంచి బయటపడుతాడని బెదిరిస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మవద్దన్నారు. ఇక నేరాల నియంత్రణలో కీలకంగా పనిచేసే సీసీ కెమెరాలపై కాలనీవాసులు ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుధాకర్, రమేష్, సంధ్యారాణి, గణపురం ఎస్సై అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెసా కమిటీలు పనిచేయాలి

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 23: 5వ షెడ్యూల్‌లోని ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి పెసా గ్రామ కమిటీలు పనిచేయాలని ఐటీడీఏ ఏపీవో భీంరావు అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జిల్లా పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అధ్యక్షతన పెసా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించగా ఏపీవో హాజరై మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీల సంప్రదాయాల ప్రకారం గ్రామాల్లో పెసా గ్రామ సభలు నిర్వహించుకునే అధికారం పెసా కమిటీలకు ఉందన్నారు. పెసా గ్రామ సభలను అమలు చేసే బాధ్యత 29 ప్రభుత్వ శాఖాధికారులకు ఉందని ఏపీవో తెలిపారు. సమావేశంలో ఆర్వోఎఫ్ఆర్ డీటీ వెంకన్న, పెసా కమిటీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలు, కార్యదర్శి రాజు, సభ్యులు ఇర్పరాజు, సమ్మయ్య, నరేంద్ర, పాయం రాకేష్, ఆలం రవి, నవీన్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో అవకతవకలపై విచారణ చేపట్టాలి

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 23: గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అవకతవకలు జరిగాయని, వాటిపై వెంటనే విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొదెం కృష్ణప్రసాద్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు గొప్ప సమ్మారావు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో బదిలీలు, పదోన్నతుల్లో భారీ అవకతవకలపై విచారణకు ఆదేశించాలని ఏపీవో భీంరావును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిపారు. దాంతో అర్హులైన అనేక మంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని పలుమార్లు డీడీ పోచంకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు గంగ, పొడెం సమ్మయ్య, అజ్మీరా రాజు, పోరిక శ్రావణ్, షైపతి సంతోష్, ఈసం రమేష్, సతీష్, రవి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 23: విద్యార్థులు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని స్థానిక మెడికల్ ఆఫీసర్ నాగరాణి సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించగా విద్యార్థులకు ఆమె వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా నర్సింగాపూర్ గ్రామంలో పల్లె దవాఖానా డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థులు వేడి ఆహారాన్ని తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.శిబిరాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు సునీత, జమున, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

కాటారం, సెప్టెంబరు 23: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించిన డీటీఎఫ్ బాధ్యులు సంఘం మండల అధ్యక్షుడు రాజేశం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో ఆవేదనతో ఎదురుచూస్తున్న పెండింగ్ డీఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాదిరిగా ఉద్యోగ, ఉపాధ్యాయులను ఇబ్బందులు పెట్టకుండా ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగ సమస్యలతో పాటు ఆర్థికపరమైన అంశాలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల కొరత ఉన్నచోట తాత్కాలిక ప్రాతిపదికన విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మణ్‌నాయక్, నాయకులు రాజనాయక్, సంజీవరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.